క్లుప్తంగా

చెత్త తరలింపులో జాప్యం వద్దు



చెత్త ఎత్తిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: వార్డుల్లోని చెత్త డబ్బాల నుంచి ఎప్పటికప్పుడు చెత్తను యార్డుకు తరలించాలని జీవీఎంసీ జోన్–4 జెడ్సీ ఎం.మల్లయ్య నాయుడు అన్నారు. బుధవారం ఆయన జోన్ పరిధిలోని 12 వార్డులను పరిశీలించారు. చెత్త నిల్వలు పేరుకుపోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో దుర్వాసనతో పాటు దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు ఎప్పటికప్పుడు చెత్త తరలింపునకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అలాగే ప్రజలు క్లాప్ వాహనాలకు చెత్త అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం




ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. అర్చకుడు భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు జరిపించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

1న సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్: మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నాదం నీ దీవెన' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి ఎంవీ రాజశేఖర్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి నగరానికి చెందిన వర్ధమాన గాయని సలాది సత్యశ్రీ 3 గంటల పాటు స్థానిక గాయనీ గాయకులతో పలు సినీ గీతాలు ఆలపించనున్నట్లు తెలిపారు. ఏయూ మాజీ వీసీ, సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ), పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు. కళాభిమానులు, కళాప్రియులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీశయన కులస్తులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



తోట వాసుదేవరావు

డాబాగార్డెన్స్: శ్రీశయన కులస్తులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు తోట వాసుదేవరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సంఘ కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలో అధిక శాతం ఉన్న శ్రీశయన కులస్తులకు మద్యం దుకాణాలు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం వంటి జిల్లాల్లో శ్రీశయన కులస్తులు అధిక శాతం ఉన్న నేపథ్యంలో ఆ కులస్తులకు న్యాయం చేయాలని వాసుదేవరావు విజ్ఞప్తి చేశారు.

పథకాల అమలుకు విజ్ఞప్తి

తాటిచెట్లపాలెం : రైల్వేలో పని చేస్తున్న ఓబీసీ ఉద్యోగులకు అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని ఆల్ ఇండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెదిరెడ్ల రాజశేఖర్ కోరారు. ఈ మేరకు డీఆర్ఎం కార్యాలయంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ కాటీని బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. డిపార్ట్‌మెంట్ ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ఓబీసీ ఉద్యోగులకు ప్రి సెలక్షన్ కోచింగ్ ఇచ్చేలా సిఫార్సు చేయాలని కోరారు. మరిన్ని సమస్యలపై మెమరండం సమర్పించారు. కార్యక్రమంలో వి.జయరాం, జి.నాగరాజు పాల్గొన్నారు.



నగరంలోని ఓ దేవాలయంలో సమావేశమైన ఉత్తర భారతీయ మహిళలు (ఫైల్)



పూజలు నిర్వహిస్తున్న ఉత్తర భారతీయులు (ఫైల్)

ఎక్కడి వారినైనా.. అక్కున చేర్చుకుంటూ..

- దక్షిణలో మనతో కలిసి జీవిస్తున్న రాజస్థానీలు.. మరాఠీలు.. బెంగాలీలు.. ఒడియా.. బీహారీలు
- పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాల్లో రాజస్థానీలు
- కురుపాం మార్కెట్.. పాతనగరంలో బెంగాలీలు
- అల్లిపురంలో ఒడియా.. బీహారీలు
- సూర్యాబాగ్‌లో జీవిస్తున్న మార్వాడీలు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం సంస్కృతీ సాంప్రదాయాలకు పుట్టినిల్లు. ఇక్కడికి ఏ ప్రాంతం నుంచి వలస వచ్చిన వారినైనా అక్కున చేర్చుకుంటారు ప్రజలు. ఎక్కడి నుంచో వచ్చిన వారు కూడా ఇక్కడి సంస్కృతికి అలవాటు పడి స్థానికంగా ఉన్న వారితో మమేకమవుతూ జీవిస్తారు. అందుకు నిదర్శనమే.. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఇక్కడ పెద్ద సంఖ్యలో ఉండడం. వారి పండగలు.. సంస్కృతీ సాంప్రదాయాలను ఇక్కడి వారితో కలిసి మెలిసి జరుపుకోవడం. ముఖ్యంగా వినాయక చవితి వేడుకలు.. దేవీ నవరాత్రులు.. విశిష్టత గల పండగల్లో స్థానికేతరులు ఇక్కడి వారితో కలిసి పాల్గొంటున్నారు. అలాగే హోలీ పండగతో పాటు దేశ వ్యాప్తంగా నిర్వహించుకునే దీపావళి, సంక్రాంతి, శివరాత్రి వంటి పండగలు కలిసి మెలిసి నిర్వహించుకుంటున్నారు. రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కూడా భాగస్వాములవుతూ దేశభక్తి చాటకుంటున్నారు.

నియోజకవర్గంలో సుమారు 50 వేల పైనే..

దక్షిణ నియోజకవర్గంలో ఉత్తర, దక్షిణ భారతీయులు 50 వేల పైబడే ఉన్నారు. పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాల్లో రాజస్థానీలు, మార్వాడీలు అధిక శాతం ఉండగా, వీరంతా డెకరేషన్ ఐటెమ్స్, పేపర్ ప్లేట్స్, కప్పులతో పాటు కిరాణా అండ్ జనరల్ స్టోర్స్ వంటి వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడ్డారు. కురుపాం మార్కెట్, పాత నగరంలో బెంగాలీలు అధిక శాతం ఉన్నారు. వీరంతా బంగారం వ్యాపారాలు, పనులు చేస్తున్నారు. ఇక అల్లిపురంలో ఒడియా, బీహారీలు అధిక శాతంలో ఉన్నారు. వీరంతా పానీపూరీ, పావ్‌బాజీ, చాట్‌తో పాటు ఫలుడా, బాదం మిల్క్.. చిన్న పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు విక్రయిస్తూ జీవిస్తున్నారు. ఇక సూర్యాబాగ్‌లో అయితే డిజిటల్ లైట్స్, డెకరేటివ్ లైట్స్ వంటి అధునాతన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు విక్రయిస్తూ మార్వాడీ, గుజరాతీ, రాజస్థానీలు స్థిరపడ్డారు.

దక్షిణలో వివిధ మతాలు.. కులాలు..

దక్షిణ నియోజకవర్గంలో స్థానికంగా ఉన్న వారితో పాటు విజయనగరం, పార్వతీపురం (మన్యం జిల్లా) శ్రీకాకుళం, పాడేరు, అనకాపల్లి జిల్లా, తూర్పు, పశ్చిమ జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాక ఒడిశా, కోల్‌కతా, నాగాలాండ్, మణిపురి, అస్సాం, బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, గుజరాత్‌తో పాటు ఎంతో మంది విశాఖకు వలసలు వచ్చి వ్యాపారాలు సాగిస్తూ స్థానికంగా స్థిరపడుతున్నారు. చేస్తున్న వ్యాపారాలతో పాటు పిల్లల చదువులు కూడా ఇక్కడే సాగుతున్నాయి. ఇక్కడి వారితో మమేకమవుతూ సేవా మార్గాల్లో నడుస్తున్నారు. వారు నమ్మే దేవుళ్ల దేవాలయాలు కూడా స్థానికంగా నిర్మించుకుంటున్నారు. ప్రతి ఏటా వారి పండగలు ఘనంగా జరుపుకుంటున్నారు.

ఆహారపు అలవాట్లనూ మార్చుకుంటున్నారు..

ఇదిలా ఉండగా ఇక్కడి ఆహారపు అలవాట్లను వారు అలవరచుకుంటున్నారు. అలాగే పానిపూరీ, భేల్‌పూరీ, పావ్‌బాజీ వంటి ఇతర రాష్ట్రాల తిళ్లకు ఇక్కడి వారు అలవాటు పడడం విశేషం.

స్థానిక ఎన్నికల్లో వారి ప్రభావం..

స్థానిక ఎమ్మెల్యే.. ఎంపీ ఎన్నికల్లో వీరి ప్రభావం కొంత మేర కనిపిస్తోంది. వార్డుల పరిధిలోకి వస్తే.. 29, 35 వార్డుల్లో రాజస్థానీ, మార్వాడీల ప్రభావం ఉండగా.. 32, 33 వార్డుల్లో ఒడియా, బీహారీల ప్రభావం ఎక్కువగా ఉంది. 38వ వార్డులో బెంగాలీలు.. 31వ వార్డులో రాజస్థానీ, గుజరాతీ, మార్వాడీల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం



తప్పిపోయిన బత్తిన నాగమణి, చిన్నారులు జ్యోత్స్న, భావన సాయి

అల్లిపురం: ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యమైన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదయింది. వెంకటేశ్వర మెట్టకు చెందిన బత్తుల వేణు తన భార్య బత్తుల నాగమణి, జ్యోత్స్న (5), భావన సాయి (3)తో కలిసి నివసిస్తున్నాడు. అతను నగరంలోని ఒక బట్టల దుకాణంలో పని చేస్తున్నాడు. డిసెంబర్ 20వ తేదీన వేణు బట్టల దుకాణానికి వెళ్లిన తర్వాత నాగమణి తన ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా తెలియక పోవటంతో వేణు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9492155652, 0891–2783672 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

వసతి గృహానికి మానసిక రోగి



షెల్టర్‌లో మానసిక రోగితో మేనేజర్ జ్యోతిర్మయి తదితరులు

సీతమ్మధార: స్థానికుడైన ఇ.గౌతమ్ (40) అనే మానసిక రోగిని టూటౌన్ పోలీసుల సహకారంతో ద్వారకానగర్‌లో ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి బుధవారం తరలించారు. అతన్ని పరిశీలించిన తర్వాత చికిత్స ప్రారంభిస్తామని సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) లెర్నింగ్ స్టడీ సెంటర్ జూలై 2024–25 అడ్మిటెడ్ బ్యాచ్ విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ డి. ధర్మారావు విద్యార్థులకు ఇగ్నో కోర్సులు, ఇగ్నో ఎగ్జామినేషన్‌కు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఇ. కృష్ణారావు, ఇగ్నో రీజినల్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ ఎస్. అనురాధ, కళాశాల అధ్యాపకులు, నూతనంగా ప్రవేశం పొందిన ఇగ్నో లెర్నర్స్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ఉపాధి శిక్షణ

మహారాణిపేట: మహిళలకు పలు ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. 18 నుంచి 25 సంవత్సరాల లోపు ఉన్న యువతులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన వారై ఉండాలన్నారు. 45 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కమ్యూనికేషన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సు, సాఫ్ట్ స్కిల్స్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 8019218586, 9392087139 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

24 గంటల్లోనే బాలిక ఆచూకీ లభ్యం

డాబాగార్డెన్స్: రాష్ట్రం కాని రాష్ట్రం నుంచి విశాఖ విహార యాత్రకు వచ్చిన ఓ బాలిక తప్పిపోయింది. అయితే పోలీసుల చొరవతో 24 గంటల్లోనే ఆ బాలిక తెలిసింది. పోలీసులు తల్లిదండ్రులకు ఆ బాలికను అప్పజెప్పారు. ఈ ఘటన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తెలిపిన వివరాలివి. కొత్తగూడెం జిల్లా నుంచి ఓ కుటుంబం మంగళవారం విహారయాత్రకు వచ్చింది. వారు నగరంలోని హార్బర్ వ్యూ లాడ్జిలో దిగారు. కుటుంబంలోని కుమార్తె సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆ బాలిక లాడ్జి నుంచి తప్పించుకుని వెళ్లిపోయింది. బాలిక తల్లిదండ్రులు కంగారుపడి పోలీస్ కమిషనర్‌కు వాట్సప్ ద్వారా మెసేజ్ పంపారు. డీసీపీ మేరీ ప్రశాంత్, హార్బర్ ఏసీపీ కాళిదాసు పర్యవేక్షణలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ జీడీ బాబును ఆ తల్లిదండ్రులు కలిసారు. సీఐ వెంటనే స్పందించి ఎస్‌ఐ శ్రీను, స్విమ్మర్ శ్రీనుతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసి, 24 గంటల్లోనే ఆ బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్

సీతమ్మధార: ఆటో డ్రైవర్లు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ద్వారకా సబ్ డివిజన్ ట్రాఫిక్ సీఐ కేఎస్ఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. గురుద్వారా జంక్షన్ వద్ద ఆటోడ్రైవర్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. బస్టాపుల వద్ద ఆటోలు పార్కింగ్ చేయరాదని హెచ్చరించారు. పాఠశాల ఆటో డ్రైవర్లు ఆరుగురికి మించకుండా పిల్లల్ని తీసుకెళ్లాలన్నారు. విధిగా సిగ్నల్ లైట్లు ఆన్ చేయాలని తెలిపారు. రోడ్డు మార్జిన్‌లోనే ప్రయాణించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కి ఆటంకం కలిగించేలా ఆటోలు పార్కింగ్ చేయవద్దని, డ్రైవర్ సీట్లో ప్రయాణికులను కూర్చోబెట్టుకోరాదని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేసి ప్రమాదాలు కోరి తెచ్చుకోవద్దని హితవు పలికారు. ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రతాప్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కేజీహెచ్ పిల్లల విభాగానికి పలు పరికరాలు



పరికరాలను డాక్టర్ శివానంద్‌కు అందజేస్తున్న ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ ప్రతినిధులు

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల విభాగానికి ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ సుమారు రూ. 4 లక్షల విలువ కలిగిన పరికరాలను సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ ద్వారా అందజేసింది. ఫౌండేషన్ ప్రతినిధి, ఆంధ్రా మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, ప్రముఖ నియోనాటలజిస్ట్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ ఈ పరికరాలు నవజాత శిశువులకు.. ముఖ్యంగా వెంటిలేటర్ అవసరమైన శిశువులకు ఎంతో సహాయకారిగా ఉంటాయన్నారు. కార్యదర్శి నటాషా పిల్లల విభాగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ పరికారాలు అందజేసినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మాట్లాడుతూ ఈ పరికరాలు ఎంతో విలువైనవన్నారు. వీటితో ఎన్నో శిశు మరణాలు నివారించవచ్చని తెలిపారు. ఫౌండేషన్‌కు చెందిన సతీష్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవాణి, డాక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు గురువారంతో ముగియనున్నాయని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. ఆయన జోనల్ కార్యాలయంలో బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి ప్రారంభించిన శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. పుట్టినప్పటి నుంచి ఇంత వరకు ఆధార్‌కార్డు తీసుకోని పిల్లలకు ఈ శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తిలో గల 143వ నంబర్ సచివాలయంలో శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. యువజన విభాగం అధ్యక్షుడిగా తాడి రవితేజ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వాసుపల్లి భారతి (బంగారమ్మ), బీసీ సెల్ అధ్యక్షుడిగా బొండాడ వెంకటరమణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఆకుల శ్యామ్‌కుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహ్మద్ అబ్దుల్లా షకీల్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా వాసరాళ్ల సుబ్రహ్మణ్యం, విద్యార్థి విభాగానికి లక్ష్మణ్, మున్సిపల్ వింగ్‌కు గొర్రిపోటి శివ, ఆర్‌టీఐ వింగ్‌కు దొడ్డి బాపూ ఆనంద్, వలంటీర్ విభాగానికి కడవల నాగమణి, గ్రీవెన్స్ సెల్‌కు అబిరెడ్డి ఆదివిష్ణు, వాణిజ్య విభాగానికి కడియం ప్రసాద్, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా కాకి పద్మ, వైఎస్సార్‌టీయూసీ విభాగం అధ్యక్షుడిగా బి.రాజు పాత్రుడు, అంగన్‌వాడీ వింగ్‌కు కొణతాల కృష్ణవేణి, లీగల్ సెల్ వింగ్‌కు ఎం.ఎల్. శ్రీనివాసరెడ్డి, కల్చరల్ వింగ్‌కు పెనుగంటి సూర్య నాయుడు, సోషల్ మీడియా వింగ్‌కు బెవర మహేష్, ఐటీ విభాగం అధ్యక్షుడిగా దండా గణేష్, దివ్యాంగుల విభాగానికి గరికిన చంద్రశేఖర్, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా డాక్టర్ డి. ఉదయ్‌కుమార్, పబ్లిసిటీ వింగ్‌కు జి. సూర్యనారాయణ (సుధా), బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా ముజీబ్‌ఖాన్, మేధావుల ఫోరం అధ్యక్షుడిగా పిల్లా అప్పారావును నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం పేర్కొంది.

కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులపై పెరిగిన దాడులు



క్రైస్తవ గీతాల సీడీ విడుదల చేస్తున్న జాన్‌వెస్లీ

సీతమ్మధార: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని, అందరం కలిసి ఎదుర్కొందామని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. గురుద్వార దగ్గర గల ఎస్‌సీకే క్రైస్ట్ చర్చిలో బుధవారం నేషనల్ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్ (నిబ్) 24వ రాష్ట్రస్థాయి క్రైస్తవ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్‌ఐబీ ఫౌండర్, అధ్యక్షుడు కాట్రగడ్డ మార్టిన్ మాట్లాడుతూ 24 ఏళ్లగా వివిధ రాష్ట్రాల్లో నిబ్ ఆధ్వర్యంలో చేసిన సేవలను వివరించారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవ్యం అంటే కృతజ్ఞతకు చిహ్నం అన్నారు. ఈనెల 26న శ్రీకాకుళం జిల్లా సోంపేటలో కల్వర్ బాప్టిస్ట్ చర్చి సభ్యులపై జరిగిన దాడి, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో పాస్టర్ చింతాడ రాజారెడ్డిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా క్రైస్తవులందరూ తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. క్రైస్తవ సంఘ కాపరులకు 8 నెలలుగా గౌరవ వేతనం, జెరూసలేం వెళ్లే యాత్రికులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయాలన్నారు. అనంతరం క్రైస్తవ గీతాల సీడీని జాన్ వెస్లీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అతిథులను సత్కరించారు. రెవరెండ్ ఎం.ఎ. పాల్, నిబ్ ఏపీ సెక్రటరీ బిషప్ ముక్తిపూడి సత్యకిరణ్, ఎం.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు



జోనల్ కార్యాలయం సమీపంలో సీపీ కార్యాలయం ఎదురుగా నాలుగంతస్తుల నిర్మాణం



జీవీఎంసీ 39వ వార్డులో వంద గజాల్లో నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల నిర్మాణం



75 ఫీట్ రోడ్డులో రోడ్డు వైండింగ్ వదలకుండా జరుగుతున్న నిర్మాణం

జగదాంబ: నిబంధనలు తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలకు సంబంధిత అధికారులు అనుమతులు జారీ చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వన్‌టౌన్‌లో వంద గజాల్లో నాలుగు.. అంతకు మించి అంతస్తులతో నిర్మించిన కట్టడాలను కూడా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. సూర్యాబాగ్ జోనల్ కార్యాలయం సమీపంలో 130 గజాల్లో ప్లాన్‌ను మించి నిర్మాణాలు జరుగుతుంటే టౌన్‌ప్లానింగ్ అధికారులకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందంటున్నారు. అలాగే 75 ఫీట్‌రోడ్డులో రోడ్డు వైండింగ్ వదలకుండా నిర్మాణాలు చేస్తున్నారు. జీవీఎంసీ 39వ వార్డు చావలివారి వీధి బాబా కోవెల వద్ద కూటమి నాయకుడి ఆధ్వర్యంలో వంద గజాల్లో అయిదంతస్తుల నిర్మాణంతో పాటు సెల్లార్‌లో దుకాణాలతో ఆ ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెబుతున్నారు. అయినా జీవీఎంసీ అధికారులు కన్నెత్తి చూడడం లేదని విమర్శిస్తున్నారు. వాస్తవానికి ఒకటి.. రెండు అంతస్తులకు జీవీఎంసీ అనుమతులు పొందాలంటే ఆ నిర్మాణానికి రెండు వైపులా రహదారితో పాటు భద్రత కోసం అగ్నిమాపక వాహనం తిరగేలా చోటు ఉంటేనే అనుమతులు ఇస్తారు. కానీ ఇరుక సందుల్లో ఇష్టానుసారం ఎలా నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. వెంటనే పరిశీలించి సంబంధిత సెక్రటరీల ద్వారా నోటీసులు జారీ చేయిస్తాం. నిబంధనలు అతిక్రమించినట్లు స్పష్టమైతే ఆయా కట్టడాలను తొలగిస్తాం.

–ఝాన్సీ, ఏసీపీ, జీవీఎంసీ జోన్–4 టౌన్ ప్లానింగ్ అధికారి.

నేటి నుంచి మాఘ మాసోత్సవాలు




ఉషా, ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి

అల్లిపురం: వెంకటకేశ్వర మెట్టపై వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో గురువారం నుంచి మాఘ మాసోత్సవాలు ప్రారంభమవుతాయని అలిమేలు మంగమ్మ అమ్మవారి దేవాలయం అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు తెలిపారు. ఈ ఏడాది 2,9,16,23 తేదీల్లో నాలుగు మాఘ ఆదివారాలు వచ్చాయని పేర్కొన్నారు. 4వ తేదీన రథ సప్తమిని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని పేర్కొన్నారు. 8వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. సాయంత్రం శ్రీనివాస కల్యాణం ఉంటుందని తెలిపారు. మాఘ పౌర్ణమి 12 బుధవారం ప్రత్యేక సముద్ర స్నానాలు చేస్తారన్నారు. అదే రోజు సాయంత్రం శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుంచి ఛాయా ఉషాదేవి సమేత సూర్యనారాయణ స్వామి వారికి విశేష పంచామృతాభిషేకాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కల్వర్ట్‌లో పడిపోకుండా బారికేడ్లతో రక్షణ



టౌన్ కొత్తరోడ్డులో తవ్వి వదిలేసిన కల్వర్ట్ (నిన్న)



కల్వర్టుకు అడ్డంగా పెట్టిన బారికేడ్లు (నేడు)

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డు ప్రధాన రహదారిలో రోడ్ల నిర్మాణం పేరుతో రహదారులు తవ్వేశారు. అందులో భాగంగా అక్కడున్న చిన్న కల్వర్టును తవ్వి వదిలేశారు. వాస్తవంగా అయితే రహదారితో పాటు కల్వర్ట్ నిర్మాణం కూడా పూర్తి చేయాలి. కానీ అలా చేయకపోవడం వల్ల మురుగుతో నిండిన కల్వర్ట్‌లో పాదచారులు, వాహన చోదకులు పడిపోయే ప్రమాదం ఉండడంతో పోలీసులు కల్వర్ట్ చుట్టూ బారికేడ్లు అడ్డంగా పెట్టారు. ఇది చూసినా వారంతా జీవీఎంసీ చేసే అభివృద్ధి ఇదేనా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు బధిర యువకుడు



యువకుడిని తల్లికి అప్పగిస్తున్న మహారాణిపేట పోలీసులు

అల్లిపురం: తప్పిపోయిన బధిర యువకుడిని వెతికి పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు మహారాణిపేట సీఐ బి.భాస్కరరావు తెలిపారు. అంగడిదిబ్బ ప్రాంతానికి చెందిన బొట్టా గౌతమ్ యాక్సిడెంట్ వల్ల బధిరుడిగా మారిపోయాడు. మంగళవారం యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు అతని తల్లి రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి యువకుడిని వెతికి పట్టుకున్నారు. బుధవారం అతన్ని తల్లి రాజ్యలక్ష్మికి అప్పగించారు. ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.